సాక్షి
పార్వతీపురం మన్యం
మంగళవారం । 26 । మార్చి । 2024



**మన్నార్ రాజగోపాలునికి శ్రీచక్రస్నానం** - 8లో
కొత్తపేటలోని మన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో నిర్వహించిన బ్రహ్మోత్సవాలు ముగిశాయి.



**మంచి కోసం జగనే సీఎం అవ్వాలి**
ప్రజలకు మంచి జరగాలంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రావాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. - 8లో

**రంజాన్ వేళలు**

| ఇఫ్తార్ | సహర్ |
|---|---|
| మంగళ (సా॥) | బుధ (ఉ॥) |
| 6.14 | 4.34 |

## న్యూస్‌రీల్

### నేడు శంబర పోలమాంబ పదో జాతర



శంబర పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మరి పదో జాతర మంగళ వారం జరుగునుంది. జాతరకు వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈఓ వి.వి.సూర్యనారాయణ పర్యవేక్షణలో సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేశారు. లడ్డూ, పులిహోర ప్రసాదాలను సిద్ధం చేయించారు. జాతర సందర్భంగా ఉదయం 9 గంటలకు చండీ హోమం నిర్వహించనున్నారు. ఎస్సై నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్నసమారాధన చేస్తామని ఈఓ తెలిపారు.


### వైభవంగా రాములోరి డోలోత్సవం



దోలా మండపం వద్ద సీతారామస్వామికి దోలోత్సవం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలోని ఉపాలయాల్లో కొలువై ఉన్న శ్రీ మాధవ స్వామి, భూభుజంగ వరాహలక్ష్మీనరసింహ స్వామి వార్ల ఐదురోజుల కల్యాణ మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ నెల 21 నుంచి ఆలయ అర్చకులు కల్యాణ మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా వేకువజామున యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం స్వామి వారి సుదర్శన పెరుమాళ్లను రామ పుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లి చక్రతీర్థ స్నానం చేశారు. సాయంత్రం సీతారామస్వామి డోలోత్సవ కార్యక్రమాన్ని వేడుకగా జరిపించారు. ఇందులో భాగంగా గోవిందరాజ స్వామితో పాటు శ్రీ సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా బోడికొండ మెట్ల వద్ద ఉన్న డోలామండపం వద్దకు తీసుకువెళ్లి డోలోత్సవం జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## విరగ్గాసిన పనస చెట్టు



సాధారణంగా ఓ పనస చెట్టుకి 20 నుంచి వంద కాయలు కాయడం సహజం. బొబ్బిలి మండలం చిలకమ్మవలసలో ఓ ఇంటి ముందున్న పనస చెట్టు ఏకంగా 320కి పైగా కాయలతో చూసే వారిని ఆశ్చర్యచకితులను చేస్తోంది. ఏటా పనస చెట్టు అధిక దిగుబడినిస్తోందని యజమాని తాడిపల్లి తమ్మన్నదొర తెలిపాడు. - బొబ్బిలి

# గూడు దగ్గరకే కూడు

గతమంతా కష్టాల కదలి.. వర్తమానం కళ్ల మందు కదలాడుతున్న ఆనందం.. ఎన్నేళ్లగానో పడుతున్న కష్టాలకు విముక్తి లభించడంతో రేషన్ లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. గతంలో నెలవారీగా రేషన్ సరుకులు తెచ్చుకునేందుకు పౌరసరఫరాల దుకాణానికి వెళ్లి గంటలకొద్దీ క్యూలో నిలబడి వ్యయప్రయాసలు పడేవారు. దశాబ్దాలుగా లబ్ధిదారులు పడుతున్న అవస్థలను ప్రభుత్వం గుర్తించి వారు నివాసం ఉండే ప్రాంతానికే నెలవారీగా రేషన్ సరుకులను పంపిస్తోంది. దీంతో తమ ఇంటిదగ్గరికే కూడు వస్తుండడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- ఇంటి ముంగిటకే రేషన్ సరఫరా
- వినూత్న ప్రయోగం.. ఎండీయూ వాహనం
- పేదల ఆరోగ్యం కోసం సార్టెక్స్ బియ్యం పంపిణీ
- అర్హులందరికీ రేషన్ కార్డులు

సాక్షి, పార్వతీపురం మన్యం

సీతంపేట మండలంలోని 53 సచివాలయాల పరిధిలో 490 గిరిజన గ్రామాలకు రేషన్ సరుకుల పంపిణీ జరుగుతోంది. గతంలో కేవలం రహదారి సౌకర్యం ఉన్న పంచాయతీ కేంద్రాలకు వచ్చి గిరిజనులు రేషన్ తీసుకునేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఈ సమస్య వారికి దూరమైంది. ప్రతి గ్రామానికీ దాదాపు వాహనాల ద్వారా రేషన్ సరుకులు అందిస్తున్నారని పులిగుమ్మి, వజ్జాయిగూడ, చింతాడ తదితర ప్రాంతాలకు చెందిన గిరిజనులు చెబుతున్నారు.

గుమ్మలక్ష్మీపురం మండలంలో రహదారి సౌకర్యం ఉన్న గిరిజన ప్రాంతాలన్నింటికీ ఎండీయూ వాహనాల ద్వారానే సరుకులు చేరవేస్తున్నారు. మారుమూల గిరిజన గ్రామాలైన డోలుకోన, కీసర, కీసరగూడ, గిరిశిఖర గ్రామం గోరటి, దబ్బలగూడ, శ్రీరంగపాడు తదితర గ్రామాలకు వాహనాల ద్వారా నేరుగా గిరిజన లబ్ధిదారులకు రేషన్ సరుకులు అందుతున్నాయి.

2019లో రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పౌరసరఫరాల శాఖలో సమూలమార్పులు చేపట్టింది. శాఖలో ఉన్న లోపాలను సరి చేస్తూ వినూత్న ప్రయోగాలకు శ్రీకారం చుట్టి అమలు చేస్తోంది. అందులో ఒకటి ఎండీయూ వాహనాల ద్వారా ఇంటికే రేషన్ సరుకుల పంపిణీ. మరొకటి..ఎన్నో ఏళ్లుగా ఉన్న రేషన్‌కార్డులను రద్దు చేసి..అర్హతే ప్రామాణికంగా కొత్తగా బియ్యం కార్డులను మంజూరు చేసింది. ఇంటి ముంగిటకే లబ్ధిదారులకు ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు ఇవ్వడం వల్ల అక్రమాలకు చెక్ పెట్టింది. కార్డుదారులకు సైతం వ్యయ ప్రయాసలు తగ్గి సమయం కలిసొచ్చింది. గతంలో రేషన్ దుకాణాలు తెరిచే సమయానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఠంఛన్‌గా ప్రతి నెలా ఒకటో తేదీ నాటికే రేషన్ సరుకులు ఇంటి దగ్గరకే వచ్చి అందుతున్నాయని లబ్ధిదారులు చెబుతున్నారు.



గుమ్మలక్ష్మీపురం మండలంలో ఎండీయూ వాహనం ద్వారా రేషన్ సరుకుల పంపిణీ

| జిల్లాకు రేషన్ సరుకుల కేటాయింపు (మెట్రిక్ టన్నుల్లో) | | | |
|---|---|---|---|
| డివిజన్ | రైస్ | పంచదార | కందిపప్పు |
| పార్వతీపురం | 2798.91 | 96.188 | 156.418 |
| పాలకొండ | 2468.645 | 73.284 | 124.833 |

**అక్రమాలు తగ్గుముఖం**

పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల పరిధిలో ఎనిమిది ఎంఎల్‌ఎస్ పాయింట్లు ఉన్నాయి. ఈ కేంద్రాల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీలోపే జిల్లాలోని 578 రేషన్ దుకాణాలకు సరుకులు వెళ్తాయి. అక్కడి నుంచి ఎండీయూ వాహనదారులు సరుకులను తీసుకెళ్తారు. వీరు ఏ రోజుకారోజు నగదు నిల్వను, ఆ రోజు మిగిలిన సరుకును మళ్లీ రేషన్ దుకాణాలకు అప్పగించాల్సి ఉంటుంది. దీనివల్ల పారదర్శకత పెరిగింది. చాలా వరకూ ఈ వ్యవస్థలో అక్రమాలు తగ్గుముఖం పట్టాయి. రేషన్ లబ్ధిదారులకు గతంలో కిలో రూపాయి చొప్పున ఇచ్చిన బియ్యాన్ని ప్రస్తుతం ఉచితంగానే కార్డులోని ఒక లబ్ధిదారుకు ఐదు కిలోల చొప్పున ఇస్తున్నారు. దీంతోపాటు ఏఏవై కార్డులకు పంచదార కిలో రూ.13.50 చొప్పున, బియ్యం కార్డుదారులకు అరకిలో రూ.17కు అందిస్తున్నారు. కందిపప్పు కిలో రూ.67, గోధుమపిండి కిలో రూ.16, కిలో రాగి పిండి రూ.11 చొప్పున సరఫరా చేస్తున్నారు. గతం మాదిరి కాకుండా తిన డానికి వీలుగా ఉండే సార్టెక్స్ బియ్యాన్ని (పోషక విలువలువలతో) ఇస్తుండడం వల్ల లబ్ధిదారులు బయట మార్కెట్‌లో విక్రయించడం లేదు. మార్కెట్‌లో అధిక ధర ఉండే కందిపప్పు, రాగిపిండి, గోధుమపిండి, పంచదార సైతం ఇస్తుండడంతో అధిక శాతం మంది రేషన్ లబ్ధిని పొందుతున్నారు. మరోవైపు రేషన్ బియ్యం అక్రమ తరలింపు, అమ్మకాలపైనా అధికార యంత్రాంగం గట్టిగా ఉంది. ఈ మేరకు జిల్లాలో 2023వ సంవత్సరంలో 6ఎ కేసులు 54, 2024లో 4 నమోదయ్యాయి. నిందితులపై కఠినంగా వ్యవహరిస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

**ఎండీయూ వాహనాలతో నిరుద్యోగులకు ఉపాధి**

రేషన్ సరుకులను ఇంటికి తీసుకొచ్చే క్రమంలో ఎండీయూ వాహన వ్యవస్థను ప్రవేశపెట్టడం వల్ల నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలిగాయి. జిల్లాకు మొత్తం 196 వాహనాలు కేటాయించగా..వాటిలో రూరల్‌లో 169, పట్టణప్రాంతాల్లో 27 వాహనాలు ఉన్నాయి. ఇందులో కూడా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకే ప్రాధాన్యమిచ్చింది.

**అర్హత ఉంటే కొత్త కార్డు**

గత ప్రభుత్వ హయాంలో రేషన్‌కార్డు పొందాలంటే అష్టకష్టాలు పడాల్సి వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే విచారణ చేసి, కార్డు మంజూరు చేస్తున్నారు. దశాబ్దాలుగా ఉన్న కార్డులను మార్పు చేసి, ప్రస్తుత ప్రభుత్వంలోనే కొత్తగా బియ్యం కార్డులను సైతం ముద్రించి అందజేశారు. జిల్లాలో మొత్తం 2,81,251 కార్డులున్నాయి. వాటిలో అంత్యోదయ కార్డులు 55,939 కాగా..బియ్యం కార్డులు 2,25,312.

**ప్రతి ఇంటికీ గ్యాస్ కనెక్షన్**

కట్టెల పొయ్యి నుంచి విముక్తి కల్పించి..ప్రతి ఇంటికీ గ్యాస్ కనెక్షన్ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లాలో మొత్తం 2,45,070 గ్యాస్ కనెక్షన్లు ఉండగా..అందులో ఉజ్వల కనెక్షన్లు 12,457 ఉన్నాయి. వికసిత్‌భారత్ కార్యక్రమం తర్వాత వాటి సంఖ్య భారీగా పెరిగింది. ఉజ్వల కనెక్షన్ దారులకు రాయితీ రూ.300 లభిస్తోంది. వీరికి కనెక్షన్‌తో పాటు, స్టవ్, సిలిండర్‌ను ప్రభుత్వమే ఉచితంగా ఇస్తోంది. దీనివల్ల చాలా మంది గ్రామాల్లో కట్టెల పొయ్యిలకు స్వస్తి పలికారని పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు.

### 26 నుంచి వైకల్యం నిర్ధారణకు పరీక్షలు

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మూడేళ్ల నుంచి 18 ఏళ్ల వయస్సు గల దివ్యాంగులకు వైకల్యం నిర్ధారించేందుకు మెడికల్ అసెస్మెంట్ క్యాంపులను నిర్వహిస్తామని సహిత విద్య కోఆర్డినేటర్ పి.భానుమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న కురుపాం ఎంఆర్‌సీ కేంద్రం వద్ద కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం మండలాలకు, 27న నర్సిపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఆర్) వద్ద పార్వతీపురం, కొమరాడ, గరుగుబిల్లి, బలిజిపేట, సీతానగరం మండలాల దివ్యాంగులకు, 28న సాలూరు రామాకాలనీ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల వద్ద సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాలకు, 30న పాలకొండ భవిత కేంద్రం (ఎమ్మార్సీ) వద్ద పాలకొండ, భామిని, సీతంపేట, వీరఘట్టం మండలాల దివ్యాంగులకు వైకల్య నిర్ధారిత పరీక్షలను నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### హోలీ.. ఆనంద కేళీ..



హోలీ సంబరాల్లో యువత

చిన్నాపెద్దా తేడాలేదు.. పేద, ధనిక తారతమ్యం లేదు.. హోలీ పండగను జిల్లా వాసులు సోమవారం సంబరంగా జరుపుకున్నారు. రంగుల వానలో తడిసి ముద్దయ్యారు. వసంత మాసానికి సంకేతంగా వచ్చిన పండగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. విజయనగరం రింగ్‌రోడ్డు గ్రౌండ్‌లో రెయిన్‌డ్యాన్స్‌లతో యువత ఉత్సాహంగా హోలీ పండగను జరుపుకున్నారు.
– సాక్షిఫొటో గ్రాఫర్, విజయనగరం

# జగన్‌మోహన్ రెడ్డిదే మళ్లీ గెలుపు



పార్టీలో చేరిన వారికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు
- పార్వతీపురంలో 'మేమంతా సిద్ధం'
- వైఎస్సార్‌సీపీలో 100 కుటుంబాల చేరిక

పార్వతీపురంటౌన్: రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, పారదర్శక పాలన అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం గెలుపు మళ్లీ ఖాయమని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం పట్టణంలోని జగన్నాథపురంలో 'మేమంతా సిద్ధం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీని గెలిపించడానికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో రైతు రుణమాఫీ ఒకటని, ఒక్క రూపాయి రైతు రుణమాఫీ చేయలేదని విమర్శించారు. అందుకే 2019 ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలు గట్టి బుద్ధి చెప్పారన్నారు. వ్యవసాయ రంగాన్ని చంద్రబాబు పాతాళానికి తొక్కేశారని, గతంలో తుఫాన్ నష్ట పరిహారం ఒక్క రూపాయి ఇవ్వలేదని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తక్షణమే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులకు అనేక సేవలందించామని చెప్పారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యం కొనుగోలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వ్యవసాయానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని గుర్తుచేశారు.

**వైఎస్సార్‌సీపీలో 100 కుటుంబాల చేరిక**

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పట్టణంలో టీడీపీ, బీజేపీలకు చెందిన 100 కుటుంబాలు ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో సోమవారం చేరాయి. తమ వార్డులో జరిగిన అభివృద్ధికి మెచ్చి తామంతా స్వచ్ఛందంగా కదిలి వచ్చి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నామని వారు ఈ సందర్భంగా చెప్పారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారందరికీ ఎమ్మెల్యే కండువాలు కప్పి సాదర స్వాగతం పలికారు. తమ ప్రభుత్వం ఎప్పుడూ ప్రజల శ్రేయస్సు, అభివృద్ధి కోసం కృషి చేస్తుందని, మీరంతా ఆశించిన విధంగా మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే జోగారావు భరోసా ఇచ్చారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక కౌన్సిలర్‌లు రణభేరి బంగారునాయుడు, చిన్నంనాయుడు, పోల సత్యనారాయణ, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పాలనకు ప్రజాశీస్సులు



అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా.. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ఐదేళ్లపాటు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాగించిన సంక్షేమ పాలనకు జనం జేజేలు పలుకుతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పాచిపెంట మండలం రాయిగుడ్డివలస వెళ్లిన డిప్యూటీ సీఎం రాజన్నదొరను అక్కున చేర్చుకున్నారు. ఆశీస్సులు అందించారు. మా కుటుంబాలకు, పిల్లలకు మంచి జరిగిందని, ఓటు తప్పకుండా వేస్తామని మాట ఇచ్చారు. అఖండ విజయాన్ని అందిస్తామని గట్టిగా చెప్పారు. ఎన్నికల వేళ ఉత్తుత్తి హామీలతో మోసం చేసేందుకు వచ్చే నాయకులు ఎవరో మాకు తెలుసని.. మీరు ధైర్యంగా ముందుకు సాగాలని భరోసా ఇచ్చారు. - పాచిపెంట

# 'తోటపల్లి'కి కొత్తకళ

తోటపల్లి ప్రాజెక్టు... శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని వేలాది ఎకరాలకు సాగునీటి ఆదరువు. ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తున్న జలాశయం ఇది. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో రూ.566.40 కోట్ల ఖర్చుతో 80 శాతం పనులు పూర్తయిన ప్రాజెక్టుపై తర్వాత వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం శీతకన్నువేసింది. ప్రాజెక్టు లక్ష్యాన్ని నిర్వీర్యం చేసింది. రైతుల సాగునీటి కష్టాలు తీర్చడంలో పూర్తిగా విఫలమైంది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ప్రాజెక్టుకు కొత్తకళ వచ్చింది. మిగులు పనులకు ఏటా బడ్జెట్‌లో నిధులు కేటాయించడం, కాలువల ఆధునికీకరణ, పిల్లకాలువల తవ్వకం, లైనింగ్ పనులు, చప్టాల నిర్మాణం వంటి పనులు చకచకా పూర్తిచేయడంతో వేలాది ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందుతోంది. చివరి దశలో ఉన్న అరకొర పనులు పూర్తయితే ప్రాజెక్టు లక్ష్యం నెరవేరుతుందని ఈ ప్రాంత రైతులు చెబుతున్నారు. అందుకే.. వైఎస్సార్ కుటుంబమంటే ఈ ప్రాంత రైతులకు మమకారం. రైతుల కష్టాలు తెలిసిన కుటుంబంగా పేర్కొంటారు.

- వైఎస్సార్ హయాంలో రూ.566.40 కోట్లతో పనులు
- తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం శీతకన్ను
- మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో నిధుల కేటాయింపు
- చకచకా పిల్లకాలువల తవ్వకం, చప్టాల నిర్మాణం
- చెరువులకు జలకళ
- వేలాది ఎకరాలకు పుష్కలంగా సాగునీరు
- ఆయకట్టు భూముల్లో నిరంతరాయంగా పంటల సాగు
- వైఎస్ కుటుంబంపై రైతన్నల మమకారం



తోటపల్లి జలాశయం

బొబ్బిలి: ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉన్న ఏకైక భారీ నీటిపారుదల ప్రాజెక్టు తోటపల్లి. ఈ భారీ ప్రాజెక్టు ద్వారా రెండు జిల్లాల్లో 1,31,221 కొత్త ఆయకట్టు, 64,000 ఎకరాల పాత ఆయకట్టును స్థిరీకరించడం వంటి పనులతో ప్రారంభమైన ప్రాజెక్టు పనులను జలయజ్ఞంలో భాగంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి 80 శాతం మేర పూర్తిచేశారు. ఆ తర్వాత వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ప్రాజెక్టు పనులను పట్టించుకోలేదు. రైతులకు సాగునీటి వెతలు మిగిల్చింది. ప్రజాసంకల్ప యాత్రగా వచ్చిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వద్ద ఈ ప్రాంత రైతులు తమ సాగునీటి కష్టాలను ఏకరువు పెట్టారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే దశలవారీగా మిగులుపనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు ఏటా బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. రెండు ప్యాకేజీలుగా రూ.123 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. భూ సేకరణ, పిల్ల కాలువల తవ్వకం, మదుముల ఏర్పాటు, గేట్లు నిర్మాణం, ప్రధాన కాలువల లైనింగ్ పనులు వంటివి చాలా వరకు పూర్తిచేశారు. మిగిలినవి చివరిదశలో ఉన్నాయి. పిల్లకాలువల తవ్వకం పూర్తయిన వరకు సాగునీటిని అందిస్తున్నారు. రూ.92 కోట్ల ఖర్చుతో సుమారు 500 కిలోమీటర్ల మేర పిల్ల కాలువలు తవ్వించారు. మరో 140 కిలోమీటర్ల తవ్వకాల పనులు జరుగుతున్నాయి.

**దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి హయాంలో తోటపల్లి ప్రాజెక్టుకు చేసిన ఖర్చు:**
2004-05 నుంచి 2013-14 వరకూ పదేళ్లపాటు రూ.566.40 కోట్లు

**వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తోటపల్లి ప్రాజెక్టుకు బడ్జెట్ కేటాయింపు ఇలా..**

| | |
|---|---|
| 2019-20 | రూ.32.45 కోట్లు |
| 2020-21 | రూ.225.57కోట్లు |
| 2021-22 | రూ.190.70 కోట్లు |
| 2022-23 | రూ.126.61 కోట్లు |
| 2023-24 | రూ.80.84 కోట్లు |

**26 కిలోమీటర్ల పిల్ల కాలువ నిర్మాణం పూర్తి**

బొబ్బిలి, తెర్లాం, బాడంగి మండలాల్లో తోటపల్లి కుడి ప్రధాన కాలువకు అనుసంధానంగా 26 కిలోమీటర్ల మేర పిల్ల కాలువలు తవ్వించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే!. రెండేళ్ల కిందటే మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తదితరులు పిరిడి వద్ద రెండు ప్యాకేజీలకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఇప్పుడు ఆ పనులు జరుగుతున్నాయి. వచ్చే ఖరీఫ్‌కు శివారు భూములకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో సాగునీటిపారుదల శాఖ అధికారులు పనులు చేయిస్తున్నారు.

### తోటపల్లి కాలువ తవ్వించి డ్రాపులు కట్టించారు



నాకు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. గతంలో సాగునీరు వచ్చేది కాదు. రెండేళ్ల కిందట మా పొలాలకు పిరిడి వద్ద గల తోటపల్లి కుడి ప్రధాన కాలువ నుంచి పిల్లకాలువలు తవ్వించారు. మా పొలాలకు సాగునీరు అందేందుకు డ్రాపులు కట్టించారు. అప్పటి నుంచి మా పొలాలకు సాగునీరు పుష్కలంగా అందుతోంది. వరి, మినుము, నువ్వు పంలు పండిస్తున్నా. చాలా సంతోషంగా ఉంది.
– దాసరి జోగినాయుడు, రైతు, పిరిడి, బొబ్బిలి మండలం

### రెండేళ్ల కిందటే పిల్ల కాలువలు తవ్వాం



తోటపల్లి కుడి ప్రధాన కాలువకు అనుసంధానంగా పిల్ల కాలువల తవ్వకం రెండేళ్ల కిందట పూర్తయింది. ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. ఈ ప్రాంతం సస్యశ్యామలమైంది.
- ఎస్.సుగుణాకరరావు, నార్త్ కోస్ట్ చీఫ్ ఇంజినీరు







ఈ పంటలు చూశారా! వరి, నువ్వు, వేరుశనగ, కూరగాయల పంటలతో కోనసీమను తలపిస్తున్న ఈ పంట పొలాలు బొబ్బిలి మండలం పిరిడి గ్రామ రైతులవి. ఈ పంటలన్నీ తోటపల్లి జలాలతో సాగవుతున్నవే!. మండు వేసవిలోనూ ఆయకట్టుకు సాగునీరు అందుతుందంటే అది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పుణ్యమే అని రైతులు చెబుతున్నారు.

## క్లుప్తంగా

### అరటితోటలో ఏనుగుల గుంపు



గవరమ్మపేట వద్ద ఉన్న అరటి తోటలో ఉన్న ఏనుగుల గుంపు

**జియ్యమ్మవలస:** మండలంలోని గవరమ్మపేట, వెంకటరాజపురం మధ్య ఉన్న అరటి తోటల్లో ఏనుగుల గుంపు తిష్ట వేసింది. సోమవారం ఉదయం వరిచేలలో ఉన్న ఏనుగులు సాయంత్రానికి అరటితోటలోకి చేరుకోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. నాలుగు రోజుల నుంచి గవరమ్మపేట, వెంకటరాజపురం పరిసర ప్రాంతాల్లో ఏనుగుల సంచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో ఎక్కడికి వెళ్తాయోనంటూ వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పంట చేలలోకి ఏనుగులు వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



అదుపులోకి తీసుకున్న వ్యక్తితో చినమేరంగి పోలీసులు

**జియ్యమ్మవలస:** మండలంలోని చిన మేరంగి గ్రామంలో అక్రమంగా సారా తరలిస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసినట్లు చిన మేరంగి ఎస్సై చిన్నం నాయుడు తెలిపారు. గ్రామంలోని రెల్లి వీధికి చెందిన ఓ వ్యక్తి ఒడిశా రాష్ట్రంలోని సందుబడి గ్రామం నుంచి అక్రమంగా 15 లీటర్ల సారా తరలించినట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించామని ఎస్సై చిన్నంనాయుడు వివరించారు.

### 347 మద్యం బాటిల్స్ పారబోత



మద్యం బాటిల్స్‌ను డిస్పోజ్ చేస్తున్న దృశ్యం

**గంట్యాడ:** ఎక్సైజ్ శాఖ దాడుల్లో స్వాధీనం చేసుకున్న 347 మద్యం బాటిల్స్‌ను ఆ శాఖ సిబ్బంది సోమవారం పారబోశారు. మండలంలో ఎక్సైజ్, పోలీస్ శాఖలు చేపట్టిన 14 దాడుల్లో 347 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. వాటిని గంట్యాడ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఎస్‌ఈబీ డీఎస్పీ బీజీజీ రాజు, ఎస్సై సురేంద్ర నాయుడు ఆధ్వర్యంలో డిస్పోజ్ చేశారు.

### మద్యం అక్రమరవాణా కేసుల నమోదు

**విజయనగరం క్రైమ్:** జిల్లా వ్యాప్తంగా మద్యం అక్రమరవాణాపై పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఈ మేరకు మద్యం అక్రమ రవాణాకు పాల్పడిన నిందితులపై 16 కేసులు నమోదుచేసి 60.3 లీటర్ల ఐఎంఎఫ్ఎల్ మద్యం స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై 32 కేసులు, మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై 20 కేసులు, కోడిపందాలు, పేకాట ఆడుతున్న వారిపై మూడుకేసులు నమోదుచేసి, 13 మందిని అదుపులోకి తీసుకుని రూ.7060 నగదు, మూడు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు.

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్‌డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹127 | ₹224 | ₹ 234 |

# సంక్షేమంతో ఆత్మాభిమానం

- ఎన్నికల ప్రచార సభలో మంత్రి బొత్ససత్యనారాయణ



సభలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ

**మెరకముడిదాం:** గత టీడీపీ ప్రభుత్వంలో మహిళలు, రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మహిళలు, రైతులు ఆత్మాభిమానంతో బతికే విధంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ఆర్థికంగా ఆదుకున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్ససత్యనారాయణ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మెరకముడిదాం మండలంలోని గాతాడ గ్రామంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ రైతులు, పేదలు కడుపునిండా అన్నం తినాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని పిలుపునిచ్చారు. గత టీడీపీ హయాంలో గాతాడ గ్రామానికి చేసిన అభివృద్ధి, తమ హయాంలో చేసిన అభివృద్ధిని బేరీజు వేసుకుని తమకు ఓటు వేయాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత వలంటీర్ల వ్యవస్థ, సచివాలయ సిబ్బంది ద్వారా గ్రామంలో మీ ఇంటి వద్దకే పరిపాలన తీసుకువచ్చి దేశంలో ఎక్కడా లేని విధంగా అవినీతి రహిత సంక్షేమ పథకాలను అందించారన్నారు. గాతాడ గ్రామానికి తాగునీరు, రహదారి సౌకర్యాన్ని కల్పించింది ఎవరో ప్రజలు గుర్తెరగాలని పిలుపునిచ్చారు. గతంలో పెన్షన్లు తీసుకునేందుకు అధికారులు, జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణ చేస్తూ పడిగాపులు కాయాల్సి వచ్చేదని ఇప్పుడు అదే పెన్షన్‌లను వలంటీర్ల ద్వారా ఒకటవ తేదీన ఉదయాన్నే ఇంటికి తీసుకు వచ్చే విధంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు.

**కళ్లకు కట్టేలా చీపురుపల్లి అభివృద్ధి**

అనంతరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు ఆరోగ్య శ్రీని పేద ప్రజలకు మరింత చేరువ చేసే విధంగా రూ.25 లక్షల వరకు పెంచి కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. చీపురుపల్లి నియోజకవర్గానికి బొత్ససత్యనారాయణ ఎమ్మెల్యే కాకముందు ఎంత వెనుకబడి ఉండేదో , ఆయన ఎమ్మెల్యే అయిన తరువాత ఎంత అభివృద్ధి చెందిందో ప్రజలందరికీ కళ్లకు కడుతోందన్నారు. తాను గాని, మంత్రి బొత్ససత్యనారాయణ గాని, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కానీ అనునిత్యం మీతో మమేకమై ఉంటామన్నారు. అదే తెలుగుదేశం నాయకులు ఎన్నికలు ముందు ఓట్లు అడిగేందుకు వస్తారు తప్పా ప్రజల కష్టసుఖాలు వారికి పట్టవన్నారు. అలాంటి నాయకులు కావాలో నిత్యం అందుబాటులో ఉన్న నాయకులు కావాలో ఆలోచించి ప్రజలు నిర్ణయం తీసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో మంత్రి బొత్ససత్యనారాయణ తనయుడు బొత్స సందీప్‌బాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్‌వీ రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ తలచట్ల హరిబాబు, పప్పల కృష్ణమూర్తి, కేఎస్ఆర్‌కే ప్రసాద్, స్థానిక నాయకులు గిడిజాల సింహాచలం, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

## మన్నార్ రాజగోపాలునికి శ్రీచక్రస్నానం



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న శ్రీరామానుజ జీయర్ స్వామి, ఆలయ ఈఓ వంశీలక్ష్మి, తదితరులు

**విజయనగరం టౌన్:** స్థానిక కొత్తపేట అనాసరపు వారి వీధిలో ఉన్న మన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 19 నుంచి నిర్వహిస్తున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో శ్రీరామానుజ జీయర్‌స్వామి ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు ఆశీర్వచనం, ఆధ్యాత్మిక ప్రవచనం అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారిణి వంశీలక్ష్మి స్వీయ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం మణిబాబు, కమిటీ సభ్యురాలు కూరెళ్ల సరోజిని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ ఐశ్వర్యలక్ష్మి అమ్మవారి తిరునక్షత్ర దర్శనం ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా స్వామివారికి శ్రీచక్రస్నానం, పూర్ణాహుతి, రాత్రి పవళింపుసేవ చేశారు. అనంతరం నర్తనశాల డ్యాన్స్ డైరెక్టర్ డాక్టర్ భేరి రాధికారాణిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ చెరుకూరి శ్రీధర్, సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### హోలీ వేడుకల్లో జెడ్పీ చైర్మన్

**విజయనగరం రూరల్:** హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు నివాసంలో ఆదివారం రాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు, ఆయన సతీమణి మజ్జి పుష్పాంజలి, కుమార్తె మజ్జి సిరి సహస్రలు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు జిల్లా ప్రజలందరిపై ఉండాలని, హోలీ పండగ అందరిలోనూ ఉత్సాహాన్ని నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ కుటుంబసభ్యులు, స్నేహితులు, తదితరులు పాల్గొన్నారు.



హోలీ వేడుకల్లో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పుష్పాంజలి దంపతులు

## ఎన్డీయేకు దూరమవుతున్న తూర్పుకాపులు

- కాపు సంఘం నాయకులు



టీడీపీ, కూటమి పార్టీలకు బుద్ధి చెబుతామంటున్న కాపు సంఘం, టీడీపీ సీనియర్ నాయకుడు

**పాలకొండ రూరల్:** తెలుగుదేశం పార్టీ, దాంతో కలిసి వస్తున్న కూటమి పార్టీలు ఉత్తరాంధ్రంలో తూర్పుకాపులను దూరం చేసుకుంటున్నాయని స్థానిక తూర్పుకాపు సంక్షేమ సంఘ అధ్యక్షుడు కనపాక చౌదరినాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో దాదాపు 35 లక్షల మంది తూర్పుకాపులు ఉన్నారని, తమకు ప్రతినిధిగా ఉన్న కిమిడి కళావెంకటరావుపై ఈర్ష్యతో, తమ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం తగ్గించేలా కూటమి వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఎచ్చెర్ల, నెల్లిమర్ల అసెంబ్లీ స్థానాలకు సంబంధించి టికెట్ల కేటాయింపుపై కూటమి పార్టీల తీరును తప్పుబట్టారు. టీడీపీపై నమ్మకం సడలిపోతున్నట్లు పేర్కొన్నారు. తమ సామాజిక వర్గానికి పట్టు ఉన్న నియోజకవర్గాల్లో ఓటమిని కోరి కొనితెచ్చుకునేలా వ్యవహరిస్తున్నారన్నారు. దీనిపై స్పందించకుంటే ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో శ్రీకాకుళం పార్లమెంట్, నరసన్నపేట, టెక్కలి, ఇచ్ఛాపురం, ఆమదాలవలస, రాజాం, పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గాల్లో భంగపాటు తప్పదని హెచ్చరించారు. ఈ ప్రాంత తూర్పు కాపులు తమ ఓటు ద్వారా టీడీపీ, కూటమికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్ల స్పష్టం చేశారు. టీడీపీ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, కూన రవికుమార్ అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. వారి స్వలాభం కోసం తూర్పుకాపులను అణిచివేసే ధోరణితో ముందుకు వెళ్తున్నారని ధ్వజమెత్తారు. దీనిని తాము గమనిస్తున్నామని, రానున్న ఎన్నికల్లో కచ్చితంగా బుద్ధి చెప్పి తీరుతామని హెచ్చరించారు. ఈ విషయంలో చంద్రబాబు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకుడు, తూర్పుకాపు సంఘం నాయకుడు కరణం వరహాల నాయుడు, సంఘం నాయకులు నారు జనార్దనరావు, పాలవలస సత్యనారాయణ, రామినాయుడు, వండాన కూర్మారావు తదితరులు విలేకరుల సమావేశంలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

### జ్ఞానానికి ఆధ్యాత్మికతే శరణ్యం

**రేగిడి:** జ్ఞానానికి ఆధ్యాత్మికతే శరణ్యమని విశాఖపట్నం జిల్లా పెందుర్తికి చెందిన శివానందాశ్రమ పీఠాధిపతి స్వామి విష్ణుదేవానంద సరస్వతి అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని రేగిడి గ్రామంలో వెలసిన దత్త పీఠంలో హోలీ పౌర్ణమి సందర్భంగా ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణనాయుడు ఆధ్వర్యంలో దత్తజ్ఞాన బోధ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానాన్ని పొందే మార్గాలను భక్తులకు ఆయన వివరించారు. కాలం మారినప్పటికీ మారని ఒకే ఒక జ్ఞాన మార్గం దైవ చింతేనని తెలిపారు. సనాతన ధర్మాలన్నీ సైన్స్ కంటే ముందుగానే విపత్తును కనిపెట్టి, వాటిని అదుపుచేసే మార్గాలను కూడా సూచించాయని తెలిపారు. ప్రజలు ఎప్పుడైతే ఈ నిజాలు తెలుసుకుంటారో అప్పుడే జ్ఞానమార్గాన్ని, మోక్ష మార్గాన్ని పొందుతారని, శాంతిని పొందగలరని వెల్లడించారు. కార్యక్రమంలో దత్తపీఠ కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు మాస్టారు, యర్రాపాత్రుని భాస్కరరావు, కుడుతుల మురళి, జల్లు శివ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



పార్టీలో చేరుతున్నవారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న డాక్టర్ తలే రాజేష్

**రాజాం:** రాజాం మున్సిపాల్టీ పరిధిలోని కొండంపేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ ఆధ్వర్యంలో సోమవారం పార్టీలో చేరారు. ఈ మేరకు గ్రామంలో డాక్టర్ తలే రాజేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించిన సందర్భంగా పార్టీలో చేరికలు జరిగాయి. గ్రామానికి చెందిన సలాది రామదాసు, సతీష్, లెంకరమణ, బత్తుల యోగి, దొండపాటి శ్రీనివాసరావు, సలాది శ్రీను, బుద్దన గోవింద, పెద్ది శ్రీను, సలాది వెంకటరమణ, పెల్లూరి శ్రీను, సలాది రమణ, సలాది అప్పన్న, సలాది సురేష్, కె.వెంకటరమణ, కోటి, దేశలంక రమణ, లంకలపల్లి చిన్నారావు, అడపా నర్సింగరావు, సలాది లక్ష్మణ, పెద్ది సత్యం. పిడుగు సత్తి, అంజి, లంకలపల్లి సురేష్, ముద్దన గోవింద, సలాది గోవిందమ్మ, శ్రీదేవి, ఎల్. శివ, సాయి, కె.గోవిందమ్మ, రావాడ మధు తదితరులతో పాటు మరో 90మందికి పైగా టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ పార్టీ కండువాలు వేసి డాక్టర్ రాజేష్ సాదరంగా స్వాగతం పలికారు. మనమంతా కలిసికట్టుగా పనిచేసి, సార్వత్రిక ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని రాజేష్ ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, సలాది తులసీరావు మాస్టారు, శాసపు వేణుగోపాలనాయుడు, దూబ గోపాలం, ఆర్నేపల్లి వెంకటనాయుడు, సింబాల రాము, యందవ సత్యనారాయణ, జేసీబీ శ్రీను, పాలవలస శ్యామ్, తోట తిరుమలరావు, కోళ్ల రమ్య, యందవ సుశీల తదితరులు పాల్గొన్నారు.

## మంచికోసం మళ్లీ సీఎం జగనే అవ్వాలి

- మంత్రి బొత్స సత్యనారాయణ



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

**గుర్ల:** ప్రజలకు మంచి జరగాలంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రావాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు గుర్ల మండలంలోని రాగోలులో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ప్రజలకు మంచి చేయడంతో పాటు మహిళలకు గౌరవం పెంచామని చెప్పారు. పేదలను ఆర్థికంగా అభివృద్ధి చేయడంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేశామని ప్రజలకు తెలియజేశారు. రాగోలు గ్రామంలో ఐదేళ్లలో రూ.ఐదు కోట్ల 40 లక్షల నగదును సంక్షేమ పథకాల ద్వారా అందించామని చెప్పారు. సంక్షేమ పథకాలను ఎటువంటి దళారులు, లంచాలు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి జమ చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామాలకు టీడీపీ నాయకులు వచ్చి లేనిపోని హామీలు ఇచ్చి ప్రజలను మభ్య పెడతారని వాటిని నమ్మవద్దని సూచించారు. మేలు చేసిన ప్రభుత్వానికి మద్దతు తెలపాలని కోరారు.

**ఎంపీ, ఎమ్మెల్యేలను భారీ మెజార్టీతో గెలిపించాలి**

ప్రచారంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన మంచి వల్ల పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. డబ్బు మూటలు ఉన్న నాయకుడి గురించి టీడీపీ నాయకులు వెతుకుతున్నారని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికలలో చీపురుపల్లి ఎమ్మెల్యేగా బొత్స సత్యనారాయణ, విజయనగరం ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్ పోటీ చేస్తున్నారని వారిద్దరికీ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయాలనే తపన జగన్‌మోహన్ రెడ్డికి ఉండడంతో పేదలందరూ గౌరవంగా ఉన్నారన్నారు. ప్రతి కుటుంబానికి మంచి జరిగితేనే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణ రాజు, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు బొత్స సందీప్, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు పాట్నూరు సన్యాసినాయుడు, జేసీఎస్ కన్వీనర్లు బెల్లాన బంగారునాయుడు, కెంగువ మధుసూదనరావు, సర్పంచ్ చందక బంగారునాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చీరకు నిప్పంటుకుని మహిళ మృతి

- చీరకు నిప్పంటుకోవడంతో ప్రమాదం



బంగారమ్మ (ఫైల్)

**గజపతినగరం/గజపతినగరం రూరల్:** గజపతినగరం మండలంలోని కొత్తబగ్గాం గ్రామానికి చెందిన ఓ మహిళ అగ్నిప్రమాదంలో కాలిపోయి తీవ్రగాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. సోమవారం ఉదయం జరిగిన ఈ సంఘటనపై గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సారిక బంగారమ్మ (45) పొలంలో నారుమడిని తయారు చేసేందుకు ముందుగా మడిలో ఉన్న కర్రపుల్లలు, ఆకులు, తాటికమ్మలు ఒక చోటకు చేర్చి మంటపెట్టింది. ఆ సమయంలో చీర కొంగుకు మంటలు తాకడం, అదే సమయంలో ఆమెకు ఫిట్స్ రావడంతో 90శాతం శరీరం కాలిపోయింది. తక్షణమే కుటుంబసభ్యులు బాధితురాలిని 108వాహనంలో గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యసేవలు అందించారు. ఈ విషయంపై పోలీసుల ద్వారా సమాచారం తెలుసుకున్న స్థానిక ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ జడ్జి కనకలక్ష్మి ఆస్పత్రికి వచ్చి బాధితురాలిని పరిశీలించి వాంగ్మూలం తీసుకున్నారు. తరువాత మెరుగైన వైద్యం కోసం విజయనగరం సర్వజన ఆస్పత్రికి బాధితురాలిని తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త అప్పారావు, పెళ్లీడుకు వచ్చిన ఇద్దరు కుమార్తెలు, ఒక బాబు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు గజపతినగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాలుడి హత్యకేసులో ముద్దాయికి యావజ్జీవం

**విజయనగరం క్రైమ్ /రాజాం సిటీ:** సంతకవిటి మండలంలోని కొండగూడెం గ్రామానికి చెందిన రెడ్డి దుర్గా ప్రసాద్(13) అనే బాలుడి హత్య కేసులో ప్రధాన ముద్దాయి కొండపల్లి గోవిందరావుకు జిల్లా అదనపు జడ్జి, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి టి.భాస్కరరావు యావజ్జీవకారాగార శిక్ష, రూ.2వేలు జరిమానా విధించారు. ఈ మేరకు రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రేగిడి మండలం లింగాలవలస గ్రామానికి చెందిన రెడ్డి సూరపునాయుడు కుటుంబంతో సహా వలస వచ్చి సంతకవిటి మండలంలోని కొండగూడెం గ్రామంలో స్థిరపడ్డాడు. సూరపునాయుడు కుటుంబానికి గ్రామానికి చెందిన గోవిందరావు కుటుంబానికి తరచూ గొడవలు జరిగేవి. అవకాశం కోసం ఎదురుచూస్తున్న గోవిందరావు గ్రామానికి చెందిన కొండపల్లి సింహాచలం, కొండపల్లి శంకరరావు, కొండపల్లి లక్ష్మీనారాయణ, కొండపల్లి అన్నపూర్ణల సహాయంతో గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద సూరపునాయుడు కుమారుడు రెడ్డి దుర్గాప్రసాద్‌ను 2021 మే 1న రాత్రి 8 గంటల సమయంలో హత్యచేశాడు. ఈ విషయంపై ఫిర్యాదు మేరకు అప్పటి సంతకవిటి ఎస్సై సీహెచ్ రామారావు కేసు నమోదుచేయగా, సీఐ డి.నవీన్ కుమార్ కేసు దర్యాప్తు నిర్వహించారు. దర్యాప్తులో భాగంగా నిందితులు ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం సీఐ బదిలీకావడంతో ప్రస్తుత సీఐ శ్రీనివాసరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని హెచ్‌సీ ఇ.తారకేశ్వరరావు సహాయంతో సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపర్చారు. ఈ కేసును అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణచంద్ వాదించగా నేరం రుజువు కావడంతో ఏడీజే, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి భాస్కరరావు పై విధంగా శిక్ష విధించారు.

### బంధువులకు వృద్ధురాలి అప్పగింత

**విజయనగరం క్రైమ్:** విశాఖపట్నం నుంచి కంటి పరీక్షలకు విజయనగరం వచ్చిన 70 ఏళ్ల వృద్ధురాలు సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఒంటరిగా ఉన్నట్లు గుర్తించిన వన్‌టౌన్ హెచ్‌సీ ఏవీ.రమణరావు, కానిస్టేబుల్ కిశోర్ స్పందించారు. దీంతో ఆమెను బాబామెట్టలోని ఏటీకే వృద్ధాశ్రమంలో చేర్పించి, ఆమె ఆచూకీ గుర్తించేందుకు చర్యలు చేపట్టారు. వృద్ధురాలు ఇచ్చిన ఆధారాలతో సమాచారాన్ని విశాఖలోని మల్కాపురం పోలీసులకు చేరవేశారు. అక్కడి పోలీసులు ఆమెను జ్ఞానాపురానికి చెందిన మెట్టపల్లి సూర్యకుమారిగా గుర్తించి, కుటుంబసభ్యులకు తెలియజేశారు. దీంతో వృద్ధురాలి బంధువులు మణికంఠ, సూర్యనారాయణ, లక్ష్మిలు విజయనగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగా పోలీసులు వృద్ధురాలిని వృద్ధాశ్రమం నుంచి స్టేషన్‌కు తీసుకువచ్చి వారికి అప్పగించారు.

### యువకుడి ఆత్మహత్య



సాయిరామకృష్ణ (ఫైల్)

**బొబ్బిలి:** పట్టణంలోని గొల్లవీధి బంగారమ్మ కాలనీకి చెందిన యువకుడు ఆలపాటి వెంకట సాయి రామకృష్ణ(25) బావిలో పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడురోజుల క్రితం ఇస్కాన్ టెంపుల్‌కు వెళ్తానని ఇంట్లో తల్లికి చెప్పాడు. అప్పటి నుంచి సెల్‌ఫోన్ స్విచాఫ్ వస్తోంది. ఈలోగా బొబ్బిలి పట్టణంలోని రాణిగారి తోటలో ఆఫీసర్స్ క్లబ్ వద్ద గల నేలబావిలో సోమవారం శవమై తేలాడు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వచ్చి మృతదేహాన్ని బయటకు తీసి శవపరీక్ష చేసి తల్లికి అప్పగించారు. మృతుడి తల్లి చికెన్ విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. తండ్రి సూరిబాబు ఆర్థిక ఇబ్బందులతో ఇటీవలే ఆత్మహత్య చేసుకున్నాడు. ఇప్పుడు సాయి రామకృష్ణ కూడా ఆత్మహత్యకు పాల్పడడంతో తల్లి గుండెలవిసేలా రోదిస్తోంది. పట్టణంలోని 15 వార్డులో ఏడో సచివాలయం పరిధిలో వలంటీర్‌గా సాయి రామకృష్ణ పనిచేస్తున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఎం.నాగేశ్వర రావు తెలిపారు.

### అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



జితేంద్ర (ఫైల్)

**చీపురుపల్లి రూరల్(గరివిడి):** గుర్ల మండలంలోని చింతపల్లిపేట గ్రామానికి చెందిన మామిడి జితేంద్ర(23) గరివిడి రైల్వే ట్రాక్‌పై అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. ఈ సంఘటనకు సంబంధించి జీఆర్‌పీ ఎస్సై మధు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి గరివిడి రైల్వే ట్రాక్‌పై ఫోన్ రింగును గమనించి స్థానిక వ్యాపారులు వెళ్లి చూడగా జితేంద్ర తీవ్రగాయాపాలై కొన ఊపిరితో ఉన్నాడు. ఫోన్ లిఫ్ట్ చేసి స్నేహితులకు ఈ విషయాన్ని చెప్పగా వారు వచ్చి విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ సంఘటనపై స్టేషన్ సూపరిండెంట్‌కు వచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్సై చెప్పారు.